ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

దళితుల భూమి 6.51 శాతమే..!

◆ సన్న, చిన్నకారు రైతులే అధికం ◆ అగ్రికల్చర్ సెన్‌సెస్ సర్వేలో తేలిన లెక్కలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సమాజంలో అణగారిన వర్గాలైన దళితులు, గిరిజనుల వద్ద నామ మాత్రపు భూమే ఉంది. ఇతర సామాజజిక తరగతుల వద్దనే ఎక్కువ భూమి ఉన్నట్టు ఇటీవల జరిగిన అగ్రికల్చర్ సర్వే ద్వారా స్పష్టమవుతోంది. ఐదేళ్లకు ఒకసారి దేశ వ్యాప్తంగా ఈ అగ్రికల్చర్ ల్యాండ్ హోల్డింగ్ గణాంకాలను భారత ప్రభుత్వం తీస్తుంది. ఇందులో భాగంగా 2021-22కు సంబంధించి ఇప్పుడు జిల్లాలోనూ అగ్రికల్చర్ సెన్‌సెస్ జరిగింది. ఇంకా పూర్తిస్థాయి సర్వే వెల్లడి అవ్వాల్సి ఉన్నప్పటికీ ప్రొవిజనల్ గణాంకాలు వచ్చేయి. దీని ప్రకారం చూస్తే అనంతపురం జిల్లాలో దళితుల వద్దనున్న భూమి 6.51 శాతం మాత్రమే ఉంది. ఇక గిరిజనుల వద్ద 2.2 శాతం భూమి ఉంది. తక్కిన భూమి అంతా ఇతర సామాజిక తరగతుల వద్దనే ఉంది.

గణాంకాలు ఇలా ..!

అనంతపురం జిల్లాలో 7,41,198 హెక్టార్ల సాగుభూమి ఉంది. ఇదంతా 4,58,044 మంది రైతుల చేతుల్లో ఉంది. ఈ మొత్తం భూమిలో 40,974 మంది దళితులకు 48,288 హెక్టార్ల భూమి ఉంది. మొత్తం జిల్లాలో ఉన్న సాగుభూమిలో లెక్కేసినప్పుడు అది 6.51 శాతం ఉంది. సగటున ఒక్కోక్కరు 1.17 హెక్టార్ల వరకు మాత్రమే భూమి కలిగున్నారు. 11,692 మంది గిరిజనుల చేతుల్లో 16,822 హెక్టార్ల భూమి ఉంది. 2.2 శాతం భూమి కలిగున్నారు. ఇతర సామాజిక తరగతులకు సంబంధించి 4,05,331 మంది రైతుల వద్ద 6,75,732 హెక్టార్ల భూమి ఉంది. 47 సంస్థల వద్ద 356 హెక్టార్ల భూమి ఉంది.

చిన్న, సన్నకారు రైతులే అధికం

అనంతపురం జిల్లాలో మొత్తం 74,119 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇందులో చిన్న.సన్నకారు రైతులే అధికంగానున్నారు. ఒక ఎకరంలోపు భూమి కలిగున్న వారు 1,66,489 మంది రైతులు 97,434 హెక్టార్ల భూమిని కలిగున్నారు. రెండు హెక్టార్లలోపు భూమి 1,68,309 మంది వద్ద ఉన్నారు. వీరి చేతుల్లో 2,45,570 హెక్టార్లు ఉంది.నాలుగు హెక్టార్లలోపు 1,02,776 మంది రైతులు 2,58,914 హెక్టార్లు కలిగున్నారు. పది ఎకరాల్లోపు కలిగున్నవారు 1,02,776 మంది ఉన్నారు. వీరి పరిధిలో 2,58,914 హెక్టార్లు భూమి ఉంది.పది ఎకరాల్లోపు కలిగున్నవారు 18,686 మంది రైతులున్నారు. వీరి చేతిలో 1,03,214 హెక్టార్ల భూమి ఉంది. పది ఎకరాలపై భూమి కలిగున్న రైతులు 1784 మంది ఉన్నారు. వీరి చేతుల్లో 1,03,214 హెక్టార్ల భూమి ఉంది. మొత్తంగా 70 శాతం వరకు చిన్న,సన్నకారు రైతులే ఉన్నారు. పూర్తి స్థాయి సమాచారం వెల్లడయ్యాక అంతకు మునుపు ఇప్పటికీ ల్యాండ్ హోల్డింగ్ ఏ రకంగా ఉందన్నది స్పష్టమయ్యే అవకాశముంది.

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పిల్లల సంరక్షణపై సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా శిశు మహిళ అభివృద్ధి, సంక్షేమ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలల సంక్షేమం రక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ వి.రత్న, ఐసిడిఎస్ పీడీ వరలక్ష్మి సంబంధిత అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామ, మండల స్థాయిలో పిల్లల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. బడి వయసు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. బాలల హక్కులు, బాల్యవివాహాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనాథలు, యాచకులు, వీధి బాలల వివరాలు మండలాల వారీగా నివేదికలు సమర్పించాలన్నారు. గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించాలే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పోక్సో కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలనకు పోలీస్, రెవెన్యూ, ఐసిడిఎస్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఐసిడిఎస్ పీడీ వరలక్ష్మి మిషన్ వాత్సల్య పథకం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కృష్ణప్ప, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, సిపిఒ విజయ్ కుమార్, డిఎస్‌డిఒ హరికృష్ణ, కమిషనర్ ప్రహ్లద తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గొల్లపల్లి' నుంచి చెరువులకు నీరు విడుదల

ప్రజాశక్తి-పెనుకొండ

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీటిని బుధవారం వదలనున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత రిజర్వాయర్లో జల హారతినిచ్చి చెరువులకు నీటిని వదులుతున్నట్లు టిడిపి పట్టణకన్వీనర్ శ్రీరాములు యాదవ్ తెలిపారు. రూ 12 లక్షలతో హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులు పూర్తి అయ్యాయని దీంతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువల ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు నీటిని విడుదల చేయనున్నామనిఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు కార్యకర్తలు సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, అధికారులు

ప్రజాశక్తి - మడకశిర

రైతులకు సమస్యలు లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతిభవనంలో అధికారులతో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనర్‌ఇరిగేషన్ శాఖ నుండి రైతులకు, ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో అత్యధిక చెరువులు ఉన్నాయి. చెరువు కట్ట గండ్లు పూడ్చుట, తూముల మరమ్మతు, శిథిలావస్థలో ఉన్న మరువను మరమ్మతు తదితర పనుల గురించి అధికారులతో సమీక్షించారు. రైతులకు, సామాన్యులకు అవసరమైన సాగు, తాగునీరు అందించే పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప, కన్వీనర్ లక్ష్మీ నారాయణ, గణేష్, కుమారస్వామి, మద్దనకుంటప్ప, దాసిరెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని చెరువుల నీటి సంఘం అధ్యక్షులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

జామియా మసీదు సందర్శన : పట్టణంలో నూతనంగా ప్రారంభించిన జామియా మసీదును ఎమ్మెల్యే సందర్శించారు. పట్టణంలో జామియా మసీదును ఇటీవల ప్రారంభించారు. అయితే ఆరోజు వివిధ కారణాల నిమిత్తం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాజు మసీదును సందర్శించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు భక్తర్ సాబ్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ముస్తఫా, మహబూబ్ బాషా, ఫయాజ్ అహ్మద్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విద్యుత్ శాఖ ఎడి : ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విద్యుత్ శాఖ ఏడీ రఘు ఎమ్మెల్యే ఎంఎస్ రాజును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని రహదారులు భవనాలు విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని కలిశారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

డిఆర్ఒ విజయసారథి

ప్రజాశక్తి-కొత్తచెరువు

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ విజయసారథి

మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని డిఆర్ఒ విజయ సారథి విద్యార్థులను ఆదేశించారు. పది పరీక్షల నిర్వహణపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోనే మినీ కాన్ఫరెన్స్ హాలులో డిఇఒ కృష్ణప్పతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పది పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరిగే పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో పది 23,730 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనుండగా వారి కోసం 449 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. వైద్య శిబిరాలనూ ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం 2-30 గంటల నుంచి పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయన్నారు. వీటికి సంబంధించి 780 మంది పరీక్షలు రాస్తుండగా వారి కోసం 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్‌పిడిసిఎల్ ప్రతినిధి రమణ రెడ్డి, లేబర్ అధికారి సూర్యనారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి మడకశిర

కెవిపిఎస్ మండల కమిటీని మంగళవారం ఏర్పాటు చేసినట్లు కేవీపీఎస్ జిల్లా నాయకులు రామాంజనేయులు తెలిపారు. మంగళవారం రొల్ల మండలంలో కెవిపిఎస్ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు అన్నమయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ ఈ మండలంలో కుల వివక్ష ఎక్కువ ఉండడంతో దాని నిర్మూలన కోసం మండల కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మండల కమిటీ అన్ని గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలన కోసం పోరాటం చేయాలని సూచించారు. కమిటీ అధ్యక్షులుగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా రంగనాథ్‌తో పాటు పదిమందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి చెరువుకు నీరు వదలండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రమైన బత్తలపల్లి చెరువును పీఏబీఆర్ నీటితో నింపితే తాగునీటి కష్టాలు నుండి ప్రజలు గట్టెక్కుతారని స్థానికులు అన్నారు.ఈ మేరకు వారు ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ధర్మవరం బ్రాంచ్ కెనాల్ నుండి బత్తలపల్లి చెరువుకు వస్తున్న పీఏబీఆర్ నీటిని ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్ బాబు,జేఈ బసవరాజు తదితరులు పరిశీలించారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ గ్రామ చెరువుకు నీరు వదలితే 15వేల జనాభా కలిగిన బత్తలపల్లిలోని ప్రజలకు తాగునీటికి కష్టాలు తప్పుతాయన్నారు. బత్తలపల్లి ప్రజలకు ఏకైక ఆధారమైన ఈ చెరువును పీఏబిఆర్ నీటితో నింపితే బోరు బావులలో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తవన్నారు. మరో మూడు రోజులు పీఏబీఆర్ నీరు విడుదల చేస్తే కనీసం 40 శాతం చెరువు నిండుతుందని ఇరిగేషన్ అధికారులను కోరారు. స్పందించిన ఎస్ఈ రాజశేఖర్ బాబు సాధ్యసాధ్యాలను పరిశీలించి నీరు విడుదల చేయడానికే ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, రైతులు గడుపూటి రామానాయుడు, బొమ్మినేని వెంకటేష్, బోయపాటి రఘురామ్, ఆదెప్ప, బత్తల రాజా, గుండు సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యాలయంలో షీ బాక్స్ ఏర్పాటు చేయాలి

ఎపిజెఎసి రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ పారె లక్ష్మి

నూతన కార్యవర్గంతో జిల్లా, రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ షి బాక్స్ ఏర్పాటు చేయాలని ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో ఏపీ జెఎసి మహిళా విభాగం హిందూపురం, పెనుగొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పారె లక్ష్మి, విజయలక్ష్మి, ఈటి జేఏసీ మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ విజయభారతి, ఏపీ జెఎసి అమరావతి సత్యసాయి జిల్లా చైర్మన్, ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా జనరల్ సెక్రెటరీ మైనుద్దీన్, అనంతపురం జిల్లా అధ్యక్షులు దివాకర్ రావు, లేపాక్షి, పరిగి తహశీల్దార్లు సౌజన్య లక్ష్మి, హసీనా సుల్తానా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పారె లక్ష్మి, విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులు, వ్యాధులను నమోదు చేయడానికి, పర్యవేక్షించడానికి ఒక కేంద్రీకృత వేదిక అయినా షీ-బాక్స్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో సైతం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో షీ-బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యాలయంలో వేధింపులకు గురైన మహిళలు ఈ షీ-బాక్స్ లో తమ కేసును నమోదు చేసుకునే విధంగా సౌకర్యం కల్పించాలన్నారు. తేనంతరం నూతన కార్యవర్గాలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల పరిధిలోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసినట్లుఅవుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, జిల్లా రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్ పేర్కొన్నారు. డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డిపో ఆవరణములో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ, స్థానిక యువర్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సహాయ సహకారాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు కన్ను అతి ముఖ్యమైన భాగము అని, ప్రయాణికులను సుఖవంతంగా చేర్చడానికి, కన్ను అతి ప్రధానమైనదని తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల భాగంగా ఈ రక్తదాన శిబిరమును నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్చార్జ్ శ్రీరాములు, గ్యారేజీ ఇంచార్జ్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోండి : జనసేన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వినతిపత్రం అందజేస్తున్న 'చిలకం'

మండల పరిధిలోని రేగాటి పల్లి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు దౌర్జన్యంగా అక్రమంగా ఆన్లైన్లో పొందుపరిచి పట్టాలు పొందారని వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి కోరారు.ఈ మేరకు ఆయన మంగళవారం ఆర్డీవో మహేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేవలం రేగాటి పల్లె గ్రామమే కాకుండా నియోజకవర్గంలోని పలు గ్రామాలలో అక్రమాలకు, దౌర్జన్యాలకు, బెదిరింపులకు వైసిపి నాయకులు పాల్పడ్డారన్నారు. తమ పలుకుబడి ఉపయోగించుకొని లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. ఆక్రమణకు గురైన భూములపై విచారణ చేపట్టి ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ తహశీల్దార్‌గా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేతనాలు ఇవ్వకపోతే సమ్మెకు సిద్ధం

శ్రీరామిరెడ్డి గ్రామీణ తాగునీటి సరఫరా యూనియన్ జిల్లా కార్యదర్శి మురళి

నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీరామి రెడ్డి తాగు నీటి పథకంలో విధుల నిర్వహిస్తున్న కార్మికులందరికీ వెంటనే వేతనాలు చెల్లించకపోతే ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే ఎల్ సోము, మురళి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పంప్ హౌస్ వద్ద సిఐటియు పట్టణ కన్వీనర్ రాముతో కలిసి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం, పెనుగొండ డివిజన్ల వ్యాప్తంగా 53 మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరందరికీ గత పది నెలల నుంచి వేతనాలను ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చెల్లించలేదని అన్నారు. వేతనాలను చెల్లించాలని అధికారులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మంజూరు చేయలేదన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ తో పాటు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌కు సైతం రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, గిరి, జబివుల్లా, శివకుమార్, రవికుమార్, నరసింహమూర్తి, సోమయ్య, చిన్నపరెడ్డి, మంజు, జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్‌పై హర్షం

బత్తలపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదవులలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ప్రకటించడం పట్ల మండల బీసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బత్తలపల్లిలో నియోజకవర్గ తెలుగు రైతు అధికార ప్రతినిధి చిట్రా నాగభూషణ, టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు బాలాంజనేయులు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బిసిలకు నామినేటెడ్ పదవులలో 34 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ నామినేటెడ్ పదవులలో బీసీలకు రిజర్వేషన్ ప్రకటించిన సందర్భాలు లేవన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలి : ఆర్డీవో

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచి రోగులకు మరిన్ని సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆర్డీవో కార్యాలయంలో పిసిపిఎన్ డిటి చట్టం అమలుపై డివిజనల్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పట్టణంలోని అన్ని స్కానింగ్ సెంటర్లు రిజిస్టర్ కావడం జరిగిందని వాటిపై ఎక్కడ ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతి స్కాన్ సెంటర్‌ను తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. చట్టాలపై మహిళా సమైక్య సమావేశాల్లో, ఉన్నత పాఠశాలలలో, జూనియర్, డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను తప్పక అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో బాబా ఫక్రుద్దీన్, డాక్టర్లు వెంకటేశ్వర్లు, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ సురేష్ నాయక్, రోటరీ క్లబ్ ప్రతినిధి నరేందర్ రెడ్డి, అన్నమయ్య సేవా మండలి సభ్యులు పోతిరెడ్డి, అయ్యప్ప సేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి 'బాలయేసు' విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైంది.కళాశాలలో బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న సూరి పద్మ జాతీయ సమైక్యత శిబిరానికి అర్హత సాధించినట్లు శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. సమన్వయాధికారి ఆచార్య మురళీధర రావు నుండి సమాచారం అందినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. ఆ విద్యార్థిని మహారాష్ట్ర లోని కొల్హాపూర్ శివాజీ విశ్వ విద్యాలయంలో ఈ నెల 16 వ తేదీ నుండి 22 వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థిని జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యక్షులు యం. బలరామి రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్. జియావుల్లా ఖాన్, ప్రోగ్రాం అధికారులు అశ్వర్థ నారాయణ, హరీష్ అధ్యాపకులు శివరామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు కదిరి వాసి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నో లో ఈ నెల 22 23 తేదీలలో జరగనున్న జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీలకు కదిరికి చెందిన లోటస్ జిమ్ నిర్వాహకులు రమేష్ ఎంపికైనట్లు రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, కమిటీ చైర్మన్ గల్లా శ్రీను, ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్ ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు.ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ నుండి రమేష్ ఎంపిక కావడం హర్షనీయమని, పోటీల్లో విజయం సాధించి రాష్ట్రాన్ని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లోటస్ నిర్వాహకులు రమేష్ మాట్లాడుతూ జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ కప్ కు ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కమిటీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల్లో పుట్టపర్తి అల్ట్రా విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. వందమంది విద్యార్థులకు, 30 మంది సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. అందులో 19 మంది విద్యార్థులకు కళ్ల అద్దాలు అవసరమని గుర్తించి కళ్లద్దాల కోసం పుట్టపర్తి అల్ట్రా విజన్ ఐ హాస్పిటల్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథ రెడ్డి, బాల మోహన్, కళాశాలల అధ్యాపకులు కవిత, ఆర్షియా, సుహాసిని ఐ హాస్పిటల్ నుండి ఆప్తోమెట్రిక్స్ స్రవంతి, సుధాకర్, సాయి మనోహర్, యస్మీన్, లిఖిత, స్పందన, నందిని, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను కాపాడుకుందాం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ కిష్టప్ప పేర్కొన్నారు. మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడవులు రక్షించడం అందరి బాధ్యత అన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ 2047 లో భాగంగా రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం ఏర్పడేలా ఏర్పాట్లు చేసుకోవాలనీ చెప్పారని ఈ విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగరాజు ఏడి సివి రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ సాయినాథశర్మ, నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి బుక్కపట్నం

జిల్లాలో బలిజ, కాపు కులస్తులు అధిక శాతం ఉన్నందువలన వారికి కేటాయించిన సబ్సిడీ రుణాల యూనిట్లను పెంచాలని బలిజ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం 2024 25 ఆర్థిక సంవత్సరానికి గాను కాపు కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాల యూనిట్లను తక్కువగా మంజూరు చేసిందన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా బలిజ కులస్తులు ఎక్కువగా ఉండటంతో వారిని దృష్టిలో పెట్టుకొని సబ్సిడీ యూనిట్లను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చెన్నకేష్ణ, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవ రాయుడు, దాసరి శ్రీనివాసులు, నాగభూషణం, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని సి కొడిగేపల్లి పంచాయతీ నల్లాయన పల్లికి చెందిన పలువురు వైసిపి నాయకులు మంగళవారం టిడిపిలో చేరారు. ఈ మేరకు వారు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి గుండుమల తిప్పేస్వామి టిడిపి కండువాలో కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లె గౌడ్, లోకేష్ రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని చాకర్లపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కవిత రాణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడిఏ సనావుల్లా హాజరై రబీలో సాగు చేసే మొక్కజొన్న వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ఆధార్ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన మొబైల్‌నెంబర్ తదితర డాక్యుమెంట్లతో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో గాని, మండల వ్యవసాయ కార్యాలయంలో గాని అధికారులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అలేఖ్య, సచివాలయ వ్యవసాయ అధికారులు ప్రియాంక, బాబావలి, నాగేంద్ర, సంబంధిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మండల వాసి ప్రతిభ

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని కొంకల్లు గ్రామానికి చెందిన శివన్న మంజుల దంపతుల కుమారుడు జనార్ధన్ ఇటీవల నంద్యాల జిల్లాలోని మహానంది వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడ పోటీలల్లో విజేతగా నిలిచి బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా జనార్ధ తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడు మడకశిర ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో డిప్లొమా చదువుతున్నాడన్నారు. నంద్యాల జిల్లాలోని మహానంది వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో విజేతగా నిలవడానికి కారణమైన మడకశిర ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రిన్సిపల్ సరోజినీ దేవి,అదేవిధంగా ఫిజికల్ డైరెక్టర్ రమేష్ ఆసీస్ కమల్ కారణమని చెప్పారు.

CHANGE OF NAME

Change of name **PATAN RAZI-ABEGUM** (old name)W/o. **PATAN ALLABAKASH** residing at D.No. 1-1125-C2, Water tank Road, Vevekananda Street, KADIRI, Sri Satya Sai District, A.P.515591, change my Name **PATAN RAZI-ABEGUM,** (Old Name) to **PATAN RAZIYA BEGUM** (New Name) hence forth my name being called as **PATAN RAZIYA BEGUM** for all pusposes.

అక్రమ నిర్మాణాలు నిలుపుదల

ప్రజాశక్తి వార్తకు స్పందన

అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి-పెనుకొండ

"జర్నలిస్టు కాలనీలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు" అనే శీర్షికన ప్రజాశక్తి లో ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. కాలనీలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆపించారు. అనుమతులు లేకుండా ఇలాంటి నిర్మాణాలు చేపట్టరాదని అలా నిర్మిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామనిటౌన్ ప్లానింగ్ సిబ్బంది హెచ్చరించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా కట్టడాలను చేపడితే కూల్చివేస్తామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలకు మాత్రమే వెసులుబాటు ఉంటుందని మంజూరు పత్రాన్ని అందించి అనుమతులు పొందాలని చెప్పారు. ప్లాన్‌లోఉన్న రోడ్లను ఆక్రమిస్తే కేసులను నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

టిడిపి నాయకుడి రుబాబు : జర్నలిస్టు కాలనీలో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని నగర పంచాయతీ సిబ్బంది నిలుపుదల చేశారు. దీంతో అక్రమ గృహ నిర్మాణాల యజమానులు తెలుగుదేశం నాయకుడిని ఆశ్రయించారు. ఆయన అక్రమ నిర్మాణాల యజమానులతో కలిసి నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కార్యాలయంలో లేరు. దీంతో మేనేజర్ వద్ద పంచాయితీ పెట్టారు. 'ఇది మా ప్రభుత్వం.. మా పార్టీకి చెందిన వారి నిర్మాణాలని ఆపుతారా? మీకు ఎంత ధైర్యం. టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అదుపులో పెట్టుకోండి' అంటూ మేనేజర్ పై చిందులు తొక్కినట్లు సమాచారం. నిర్మాణాలను ఎవరు ఆపలేదని పత్రాలను సమర్పించి నిబంధన మేరకు అనుమతులు తీసుకోవాలని అధికారులు చెప్పినట్లు తెలిసింది. 'మా పార్టీకి చెందిన వారి నిర్మాణాలను ఆపుతారా నీ కథ ఏంటో చూస్తా'మంటూ అధికారులను బెదిరించినట్లు తెలిసింది. పంచాయతీలో అక్రమ నిర్మాణాలకు ఇలా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ప్రోత్సహించడం ఎంత వరకు సబబు అంటూ అధికారులు మధన పడుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ కమిషనర్ సిబ్బందిపై ఇలాగే బెదిరింపులు చేయడంతో అందరూ బదిలీలు చేసుకుని వెళ్లినట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా మంత్రి ఇలాంటి వాటిపై దృష్టి సారించి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారిని, అధికారులను బెదిరిస్తున్న వారిని అదుపులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

వర్కర్లుగా ఉద్యోగోన్నతి ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

అంగనవాడి హెల్పర్స్‌కు వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని సిఐటియు నాయకులు కోరారు.ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఎవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు జెవి రమణ, ఎల్. ఆదినారాయణ , హైదర్ వలి మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలోని వర్కర్ల ఖాళీ కావడంతో అదే సెంటర్లో పనిచేస్తున్న హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. అర్హత ఉన్న హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్లు ఇవ్వకుండా ఇంటర్వ్యూలు జరిపి కొత్తవారికి అవకాశం ఇచ్చే ప్రయత్నం అధికారులు చేస్తున్నారని అన్నారు. ఈ నెల 13 తేదిన జరిగే ఇంటర్వ్యూలో హెల్పర్లకు అవకాశం ఉన్న ప్రతి చోట వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇంటర్వ్యూలు అడ్డుకుంటామని హెచ్చరించారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

ప్రజాశక్తి -నంబులపూలకుంట

ఈ నెలలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలుకు సంబంధించి నిధులను కేటాయించాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ వేతన సవరణ కమిటీని నియమించి మంచి ఫిట్మెంటుతో పిఆర్సి ఇస్తామని, సకాలంలో డీఏలు ఇస్తామని, వేల కోట్ల బకాయిలు విడతల వారీగా చెల్లింపులు చేస్తామని ప్రకటించి మేనిఫెస్టోలో సైతం చేర్చారని తెలిపారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడు మాసాలు గడుస్తోందని హామీల అమలు కోసం ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. తక్షణం ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గౌరవాధ్యక్షులు రామాంజనేయులు యాదవ్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, పాఠశాలల పునర్విభజన ప్రక్రియ లోని అసంబద్ధాలను తొలగించాలని, ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం తో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా కౌన్సిలర్ రమణా నాయక్, మురళి, సందీప్ ,రహీం, వెంకటరమణారెడ్డి, రమణయ్య, ముషీర్ అహ్మద్, సుదర్శన్, గోపాల్, వరలక్ష్మి, మంజు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో పని చేద్దాం : మున్సిపల్ చైర్మన్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరు ఇష్టంతో పనిచేసి హిందూ పురపాలక సంఘాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని, దానికి అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ శానిటిషన్ సెక్రటరీలు, మెప్మా రిసోర్స్ పర్సన్ లతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ, పట్టణ సుందరీకరణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి కార్యక్రమాన్ని అందరూ ఐక్యంగా విజయవంతం చేసి ఆదర్శవంతమైన పురపాలక సంఘంగా తీర్చిదిద్దాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిర్దేశించిన విధుల్లో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, మున్సిపల్ అధికారులు, సెక్రటరీలు, మెప్మా కో ఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలి : హిందూపురం పురపాలక సంఘం పరిధిలో అన్ని వార్డుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వార్డు పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుతో కలిసి 5వ వార్డు ఆబాద్ పేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వీధి దీపాలు వెలగడం లేదని, కాలువలు, నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా తనను కలవవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ అహమ్మద్, మునిసిపల్ డీఈఈ. వాణి, ఏఈలు జనార్ధన్, శంకర్, సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయం : పట్టడానికి చెందిన కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో రాణించడం అభినందనీయమని మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అన్నారు. ఆదివారం విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో హిందూపురం పట్టణానికి చెందిన పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సి ధనుష్ కుమార్, ద్వితీయ స్థానాలను సయ్యద్, కిషోర్ కుమార్ కైవసం చేసుకున్నారు. వీరితో పాటు శోభన్, సయ్యద్ బరీర ఐమాన్, జాన్ విక్టర్, కేఎస్ రిషి రామ్, బి కనిష్కా వెంకటేలు తృతీయ స్థానాన్ని సాధించారు. ప్రతిభ కనబరిచిన కరాటే విద్యార్థులను ఛైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు అభినందించారు. శిక్షణ అందించిన కరాటే మాస్టర్లు సెన్సేయి ఫైరోజ్, ఉసామ ఖాన్, చరణ్ రాజ్‌ను వారు అభినందించారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పెనుకొండ

పెనుకొండ డివిజన్ పరిధిలోని ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టులలో ఖాళీలు ఉన్న పోస్టులకు పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. డివిజన్లోని పెనుకొండ, సోమందేపల్లి, హిందూపురం, మడకశిర, గుడిబండ ప్రాజెక్టులలో 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు 55 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 46 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఆర్డీవో ఆనంద్ కుమార్, ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మి ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. అభ్యర్థుల విద్యా అర్హత పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు శాంత లక్ష్మి, నాగమల్లేశ్వరి, రాజేశ్వరి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి విదేశీ భక్తుల సేవలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి లోని ఎంతోమంది యాచకులు, ప్రయాణికులు, పనులు కొరకు వచ్చిన కార్మికులకు ప్రతిరోజు సత్య సాయి ప్రసాదం పేరుతో ప్రతిరోజు ఉదయం అల్పాహారాన్ని సత్యసాయి విదేశీ భక్తులు అందజేసి వారి ఆకలి తీరుస్తున్నారు. సత్య సాయి భక్తులుగా పుట్టపర్తికి వచ్చి ఇక్కడే స్థిరపడిన విదేశీ భక్తులు సుసాన్ మిల్లర్, డేనియల్ కోహేర్ తన వంతు సాయం అందించాలని దృక్పథంతో పుట్టపర్తి, యనమల పల్లి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఎంతోమంది వృద్ధులకు యాచకులకు ఇతర ప్రాంతం నుండి ఆసుపత్రికి వచ్చిన వారికి నారాయణ సేవ, అన్న ప్రసాదాలను అందజేస్తూ వారి ఆకలిని తీరుస్తున్నారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికులు సిఐటియులో చేరిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డివిజన్ పరిధిలోని సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో అవుట్‌సోర్సింగ్‌కార్మికులుగా పనిచేస్తున్న 25 మంది కార్మికులు సిఐటియు అనుబంధంలో చేరారు.ఈ మేరకు పట్టణంలోని ఎన్జీవో హోంలో మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కార్మికులు అందరి ఆమోదంతో సిఐటియు లో చేరారు. ఈ సమావేశానికి హాజరైన సిఐటియు జిల్లా కోశాధికారి బత్తల సాంబశివ, సిఐటియు పట్టణ కార్యదర్శి జగన్మోహన్, ముస్తాక్ మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆఫ్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనీ నిర్ణయం తీసుకుందన్నారు.కార్మికుల కడుపుకొట్టే ఈ నిర్ణయాన్ని ఉపహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఏజెన్సీలకు అప్పగిస్తే దలాళీ వ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు. గతంలో ఏజెన్సీలు కార్మికులకు పిఎఫ్,ఇఎస్ఐ లు నెలల కొద్ది కార్మికులకు చెల్లించకుండా ఎగొట్టిన అనుభవాలు వున్నాయన్నారు.ఈసందర్భంగా కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా చంద్రమౌలి, కో కన్వీనర్లుగా శివప్రసాద్, నిర్మలతో పాటు 20 మంది కమిటీ సభ్యులతో ఏర్పాటు చేశారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, తదితరులు

వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - రొద్దం

వైసిపి సీనియర్ నాయకులు గోనిమేకలపల్లికి చెందిన పురుషోత్తం రెడ్డి సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ భర్త శ్రీ చరణ్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాలులు అర్పించారు. అయన వెంట మండల నాయకులు వినయ్ రెడ్డి, సి నారాయణ రెడ్డి, ఎన్ నారాయణ రెడ్డి, కన్వీనర్ తిమ్మయ్య, మావటూరు సుధాకర్ రెడ్డి,లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ లో పీజీ కోర్స్ ను ధర్మవరం పట్టణానికి చెందిన పచ్చా శంకర్ నాయుడు కుమారుడు పి.దుర్గాప్రసాద్ దక్కించుకునాక్నడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన దుర్గాప్రసాద్ 1300ల రాష్ట్ర ర్యాంకు సాధించాడన్నారు. నంద్యాలలోని శాంతిరాం మెడికల్ కళాశాల పల్మానాలజీ విభాగంలో పీజీ సీటును ప్రభుత్వ కోటాలో సాధించాడన్నారు.

కుంభమేళాలో గుడిబండ వాసి గుండెపోటుతో మృతి

గుడిబండ : ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లిన గుడిబండ మండలం బాలేపల్లి గ్రామానికి చెందిన నాగరాజు (52) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఎల్ ఎన్ పి ఇటుకల ఫ్యాక్టరీ యజమాని అయిన నాగరాజు తన స్నేహితులతో కుంభమేళా కార్యక్రమానికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే అతనిస్నేహితులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

20 రోజుల్లో చెరువులను నింపుతాం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని ఏబి పల్లి తండా వద్ద ఉన్న మద్దిలేరు (యోగివేమన) ప్రాజెక్టు ద్వారా సమీపంలోని చెరువులన్నింటినీ 20 రోజుల్లో పూర్తిస్థాయి నీటితో నింపుతామని నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము హామీ ఇచ్చినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం వేమయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతుల సమస్యలపై మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో అనంతపురంలో ఎస్సీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామును కలిసి సమస్యను వివరించామన్నారు. తమ అభ్యర్ధనకు సంబంధించిన ఆయన ప్రాజెక్టు పరిధిలోని చెరువులన్నీటినీ రాబోయే 20 రోజుల్లో నీటితో నింపుతామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నగిరి కాటమయ్య తో పాటు బెల్లం మహదేవ్, కమతం కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగ నోట్ల కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కదిరి గొర్రెల మార్కెట్ లో దొంగ నోట్ల చలామణి చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ వి.రత్న వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో డీఎస్పీ శివన్నారాయణ,సీఐ నిరంజన్ రెడ్డిలతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. సులువుగా నకిలీ నోట్లను చలామణి చేసి డబ్బు సంపాదించాలని ఆశతో కర్నాటక ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు గొర్రెల మార్కెట్ టార్గెట్ చేసుకొని అమాయక గొర్రెల వ్యాపారస్తులకు దొంగ నోట్లను అంటగట్టి పొట్టేళ్ళను తీసుకెళ్లారు.ఈ కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి రూ. 30 వేల నకిలీ కరెన్సీ నోట్లు, రూ. 20,500 ఒరజినల్ నోట్లు, రెండు ద్విచక వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల అరెస్టులోకీలకంగా వ్యవహరించిన కదిరి రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ జి.నిరంజన రెడ్డి,పోలీస్ సిబ్బంది విజయభాస్కర్, షహీన, దామోదర్, రవి కుమార్ నాయక్, జిల్లా స్పెషల్ టీం సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. రివార్డుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని కదిరి రాయచోటి రోడ్డుపై రెండు ద్వి చక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాల చోదకులైన పోరెడ్డివారిపల్లికి చెందిన ఉత్తన్న, చిన్నరెడ్డికి గాయాలు అయ్యాయి. వీరిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని ఎండల బండి వీధిలో నివాసముంటున్న శ్రీనివాసులు (30) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఆరోగ్యం క్షీణించడంతో మనస్థాపానికి చెందిన శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెంట్రింగ్ కార్మికుడు...

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలంలోని ఓబుల నాయన పల్లి ఎగువ తండాకు చెందిన లావడియా శ్రీధర్ నాయక్(25) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీధర్‌నాయక్ ఇంటి నిర్మాణాలకు సెంట్రింగ్ పనులకు వెళుతూ జీవనం చేస్తూ ఉండేవాడు. ఈసందర్భంగా అతను పనిచేసే చోట అక్కడక్కడ అడ్వాన్స్ కింద సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయలు తీసుకున్నాడు. వారు డబ్బులు అడిగితే ఎవరైనా పనికి పిలిస్తే అడ్వాన్స్ ఇప్పించుకొని ఇస్తానని చెప్పేవాడు. కానీ ఎక్కడ పని దొరకలేదు. దీంతో మనస్థాపానికి గురైన శ్రీధర్‌నాయక్ తన ఇంటిలో మంగళవారం ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

టింబర్ డిపోలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు సమీపంలోని ధర్మవరం రోడ్డు నందు ప్రైవేటు వ్యక్తి స్థలంలో గోరంట్లకు చెందిన శ్రీనివాసులు అనే వ్యాపారి గ్రామీణ ప్రాంతాల నుంచి కట్టెలను ట్రాక్టర్లలో తరలించి అక్కడ నిలువ ఉంచుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం అక్కడ చెత్తాచెదారం ఉన్నందున ఆయన నిప్పు పెట్టడంతో గాలి అధికమై మంటలు వ్యాపించి అక్కడున్న కట్టెలు దగ్ధమయ్యాయి. వెంటనే పుట్టపర్తి ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో తనకు దాదాపు రూ. 50వేలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

ఐచర్ బోల్తా

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడి తోట పాట్నాపల్లి రహదారి మధ్యలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నార్పల మండల పరిధిలోని ముచ్చుగుంటపల్లి గ్రామానికి చెందిన రైతు అంతపు చిన్నపురెడ్డికి చెందిన చీనీకాయలను చెన్నై వ్యవసాయ మార్కెట్ కు తీసుకు వెళుతుండగా దాడి తోట పార్నపల్లి ప్రధాన రహదారిపై అదుపుతప్పిన ఐచర్ బోల్తాపడింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

డ్రిప్ పరికరాలు దగ్ధం

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని.చందకచర్ల పంచాయతీ మరువ పల్లి గ్రామంలో వెంకటేష్ అనే రైతు పొలంలో జరిగిన అగ్నిప్రమాదంలో డ్రిప్పు పరికరాలు, పివిసి పైపులు దగ్ధమయ్యాయి. దీంతో తనకు రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతుల వాపోయాడు. నష్టపోయిన రైతు వెంకటేష్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై నేడు విచారణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఉప కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న లేపాక్షి మండలం మద్దిపి గ్రామానికి చెందిన టి.కొత్తపల్లి కదిరప్ప గత ఏడాది నవంబర్ 27వ తేదీన మృతిచెందాడు. దీనిపై అప్పట్లో స్థానిక వన్ టౌన్ పోలీసులు అనుమానాస్పద స్థితి మృతి కింద కేసు నమోదు చేశారు. ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి మరుణాయుధాలతో దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురి చేశారన్న అభియోగంపై వివిధ సెక్షన్ల కింద కదిరప్ప పై పోలీసులు కేసు నమోదు చేయగా ఉపకారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే అనారోగ్యంతో ఆయన మృతి చెందగా పోలీసులు అనుమానాస్పద స్థితి కింద కేసు నమోదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెనుకొండ సబ్ డివిజనల్ అధికారి మెజిస్టీరియల్ విచారణను బుధవారం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ వెంకటేష్ తెలిపారు.

వన్‌టౌన్ ఎస్ఐగా కేతన్న

ధర్మవరం టౌన్ : ధర్మవరం వన్ టౌన్ ఎస్ఐగా కేతన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న కేతన్నకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అదే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా ఉద్యోగోన్నతికల్పించారు. ఈ సందర్భంగా కేతన్న డీఎస్పీ హేమంత్ కుమార్‌ను, వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుట్టపర్తిలోని సాయి ఆరామంలో మంగళవారం సాయంత్రం రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గణేష్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, నరేందర్ రెడ్డి, ఇందిర,రూరల్ ఎస్ఐ లింగన్న, ఆటో డ్రైవర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూలకుంట : వాహనదారులు వాహనం నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలనికదిరి ఆర్టీవో వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు నిబందనలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనదారులు,ప్రజలతో ర్యాలీ నిర్వహించారు.

హిందూపురం :వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని పట్టణ సిఐ రాజగోపాల్ నాయుడు సూచించారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీధర్, కళావతితో పాటు ఆటో డ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు.